## క్లుప్తంగా

### సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి

**బొమ్మలసత్రం:** బైక్‌పై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణగా ఉంటుందని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో అధికంగా బైక్ ప్రమాదాలే ఉన్నాయని తెలిపారు. ఎక్కువ శాతం హెల్మెట్ ధరించని వారే ఉన్నారన్నారు. వీటిని నివారించేందుకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. బైక్ నడపడానికి ముందు తమ కుటుంబ సభ్యులను గుర్తుచేసుకుని వారికి తామే ఆధారమని భావించి హెల్మెట్ ధరిస్తే ఎలాంటి ప్రమాదం జరిగినా ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా ఉంటుందన్నారు. హెల్మెట్ ధరించకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలపై అతి వేగం కూడా ప్రమాదకరమన్నారు. ముందుగా బయలుదేరి నెమ్మదిగా గమ్యస్థానానికి చేరుకోవడం శ్రేయస్కరమని పేర్కొన్నారు.

### వేడుకగా అష్టాదళ పాదపద్మారాధన సేవ


ప్రత్యేక అలంకరణలో కాళికాంబ

**నంద్యాల (వ్యవసాయం):** స్థానిక గాంధీచౌక్‌లోని శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతం, నిమ్మ, వేప రసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం, 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ చేశారు. మహా మంగళ హారతులు ఇచ్చారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### 410 మందికి వైద్య పరీక్షలు

**శిరివెళ్ల:** కోటపాడులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. నంద్యాలకు చెందిన వైద్యులు కృష్ణమోహన్‌రెడ్డి, శ్రీకాంత్ గ్రామానికి చెందిన 410 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. 8 మందిని ఆరోగ్యశ్రీ ఆపరేషన్లకు రెఫర్ చేశారు. ప్రభుత్వ వైద్యాధికారి దివ్య, సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### పరామర్శ

**ఉయ్యాలవాడ:** మండలంలోని హరివరం గ్రామంలో ప్రమాదవశాత్తు గాయపడిన పలువురిని ఆళ్లగడ్డ వైఎస్సార్‌సీపీ నేత భూమా కిశోర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఉప సర్పంచ్ ఎర్రి శ్రీనివాసరెడ్డి, గ్రామానికి చెందిన పాలాజి విజయకుమార్, గుండ్లకుంట శివను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు సింగిల్ విండో చైర్మన్ పల్లె మహేశ్వరరెడ్డి, బోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పుట్టాలమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ అంబటి మహేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

### వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన


కోటపాడులో ప్రచారం చేస్తున్న గంగుల సారికారెడ్డి

**శిరివెళ్ల:** వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రానాథ్‌రెడ్డి సతీమణి గంగుల సారికారెడ్డి అన్నారు. మంగళవారం కోటపాడు గ్రామ సచివాలయ పరిధిలో ఇంటింటి ప్రచారం చేశారు. ఆమెకు గ్రామస్తులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో 85 శాతం కుటుంబాలకు నవరత్నాల ద్వారా లబ్ధి చేకూరిందని తెలిపారు. గ్రామంలో రూ. 25 కోట్ల సంక్షేమ ఫలాలు పేదలకు అందాయన్నారు. 123 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామని తెలిపారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. అబ్దుల్ సలాం, సర్పంచ్ దూదేకుల ఉసేనిబీ, పార్టీ నాయకులు సుబ్బసత్యనారాయణశ్రేష్టి, సాలరాజు, గురిజాల లీలావతి, గోపాల్‌రెడ్డి, చింతకుంట శేషిరెడ్డి, రఘునాథరెడ్డి, గుర్రప్ప, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### జగనన్నను గెలిపించుకుందాం


తోడేండ్లపల్లె గ్రామస్తులతో అవంతికరెడ్డి

**చాగలమర్రి:** సంక్షేమ పథకాలు పేదలకు సక్రమంగా చేరాలంటే రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి సోదరి గంగుల అవంతికరెడ్డి అన్నారు. మంగళవారం తోడేండ్లపల్లె, డి.వనిపెంట పంచాయ ఓజి తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేదలు సుభిక్షంగా ఉండాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. ఎంపీపీ వీరభద్రుడు, సర్పంచ్ గోవిందయ్య, శ్రీనివాసులు ఉన్నారు.

# కల సాకారం

- దొర్నిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియెట్‌కు అనుమతి
- పాఠశాల హెచ్‌ఎంకు ఉత్తర్వులు అందజేసిన డీఈఓ
- ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకు అనుమతి
- 2024–2025 విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం

**గ్రామీణ విద్యార్థులు** పాఠశాల విద్య తరువాత ఇంటర్..ఆపై చదువులకు దూరం ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. మండలంలో ఇంటర్మీడియెట్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల పట్టణాలకు వెళ్లి చదువుకుంటున్నారు. ఇన్నాళ్ల ఎదురుచూపులకు ఎట్టకేలకు తెరపడింది. దొర్నిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2024–2025 విద్యాసంవత్సరం నుంచి ఇంటర్మీడియట్‌ను అనుమతి ఇస్తూ డీఈఓ సుధాకర్‌రెడ్డి ఉత్వర్వులు ఇచ్చారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రూ.1.71 కోట్లతో నూతనంగా నిర్మించిన అదనపు గదులు

**దొర్నిపాడు:** దొర్నిపాడు జెడ్పీ హైస్కూల్‌లో ఏటా 600 నుంచి 700 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ ఏడాది 120 మంది మంది విద్యార్థులు పదో తరగతి పూర్తి చేశారు. వీరంతా గతంలో ఇంటర్ లేకపోవడంతో ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల పట్టణాలకు వెళ్లి చదువుకోవాల్సి వచ్చేది. 1960లో ప్రారంభమైన పాఠశాలలో ప్రస్తుతం ఇంటర్‌కు అనుమతి వచ్చింది.

**ఆయన కృషి వల్లే**

గ్రామానికి చెందిన పయిడేల లక్ష్మీనారాయణరెడ్డి 60 ఎళ్ల క్రితం ఐదు ఎకరాల పొలాన్ని పాఠశాలకు విరాళంగా ఇచ్చారు. అప్పట్లో పాఠశాల మంజూరు అయినా స్థలం ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో తన స్థలాన్ని ఇచ్చారు. అందుకే ఆయనకు గుర్తుగా పాఠశాలలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన పేరును పాఠశాలకు నామకరణం చేయాలని కుటుంబీకలు ఎంత ప్రయత్నిస్తున్నా కుదరడం లేదు.

**జూన్ ఒకటి నుంచి తరగులు**

2024 జూన్ 1 ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించనున్నారు. మండలంలో భాగ్యనగరం, దొర్నిపాడు, డబ్ల్యూ కొత్తపల్లె గ్రామాల్లో జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ ఏడాది 218 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు.

**మండలంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలు**

| | |
|---|---|
| ఉన్న గ్రామాలు : | 1.భాగ్యనగరం |
| 2.దొర్నిపాడు | 3.డబ్ల్యూ కొత్తపల్లె |

మొత్తం పదో తరగతి విద్యార్థులు– 218 మంది


దొర్నిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల

**నేను ఇక్కడే ఇంటర్ చదువుతాను**



నేను ఈ ఏడాది 10వ తరగతి పూర్తి చేశాను. ఇంటర్ కూడా ఇక్కడే చదువుతాను. ప్రస్తుతం 2024–2025 విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం కానుండడంతో మొదటి బ్యాచ్ విద్యార్థిగా గర్వపడుతున్నాను. మంచిగా చదివి కళాశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొస్తాను.
–యశ్వంత్, పదో తరగతి విద్యార్థి

**తప్పనున్న ఆగచాట్లు**



ఉన్నత పాఠశాలలో 700 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల, దొర్నిపాడు, ఎస్సీ బాలుర, బీసీ బాలిక వసతి గృహాల్లోని విద్యార్థులు ఇక్కడే చదువుతున్నారు. ఇంత మంది విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలో ఇన్నాళ్లుగా ఇంటర్మీడియెట్ లేకపోవడంతో బాధపడేవారం. ప్రస్తుతం ఇంటర్ రావడం సంతోషంగా ఉంది.
–నర్సిరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్, దొర్నిపాడు

**సంతోషకరమైన విషయం**



మా మామయ్య 60 ఏళ్ల క్రితం పాఠశాల నిర్మాణానికి స్థలం ఇచ్చారు. ప్రస్తుతం పాఠశాలను ఇంటర్ కళాశాలగా గుర్తించడం సంతోషకరం. పాఠశాలకు పయిడేల లక్ష్మీనారాయణరెడ్డి పేరు పెట్టాలని కలెక్టర్, ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని కలిసి కోరాను. గత ఏడాది జెడ్పీ సీఈఓ విచారణ కూడా చేశారు. కానీ కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వం దృష్టికి మరోసారి తీసుకెళతాను. ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాలబాలికలు ఇక్కడే ఇంటర్ చదువుకోవచ్చు.
–శకుంతలారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, దొర్నిపాడు

**ఏళ్ల నాటి కల నెరవేరింది**



స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియెట్ కళాశాలగా గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉంది. ఏళ్ల నాటి కల. విద్యార్థులు వ్యయప్రయాసలు పడి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. స్థానికంగానే చదువుకోవడం మంచి పరిణామం. పూర్వపు విద్యార్థిగా గర్వపడుతున్నాను.
–శ్రీధర్ శర్మ, పూర్వపు విద్యార్థి (మాజీ బ్యాంక్ ఉద్యోగి) దొర్నిపాడు

**అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి**



స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇక నుంచి ఇంటర్ కూడా చదువుకోచ్చు. ఈ మేరకు అప్‌గ్రేడ్ చేస్తూ డీఈఓ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఏటా 100 మందికి పైగా విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ప్రస్తుతం ఇక్కడే బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపులకు అనుమతి ఇచ్చారు. పదో తరగతి ఫలితాల అనంతరం ఇంటర్ చదివేందుకు అడ్మిషన్లు ప్రారంభిస్తారు.
–శ్రీనివాసరావు, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, దొర్నిపాడు

### వేసవిలో నీటి పొదుపు అవశ్యం

**నంద్యాల(సిటీ):** వేసవిని దృష్టిలో ఉంచుకుని నంద్యాల మున్సిపల్ పరిధిలోని ప్రజలు తాగునీటిని పొదుపుగా ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. వెలుగోడు రిజర్వాయర్‌లో తగినంత నీటి నిల్వలు లేనందున నీటి ఎద్దడి ఏర్పడకుండా పొదుపుగా ఉపయోగించుకోవాలన్నారు. పట్టణంలో ఏవైనా తాగునీటి సమస్యలు ఉంటే 7702776048 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### నేటి నుంచి పింఛన్ల పంపిణీ

**ఉయ్యాలవాడ:** మండలంలోని సచివాలయాల్లో బుధవారం నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, మంచానికే పరిమితమైన వారికి ఇళ్ల వద్దనే పింఛన్లు అందజేస్తామన్నారు. వివిధ పింఛన్‌దారులు మొత్తం 3,983 మంది ఉన్నారని..రూ.1,17,53,000 పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

### డ్రైవర్లను అవమానించడం తగదు


నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్లు

**ఆళ్లగడ్డ:** రాజకీయాల కోసం డ్రైవర్లను అవమానించడం సరికాదని ఆ సంఘం సభ్యుడు మాదం కిశోర్ అన్నారు. మంగళవారం పట్టణంలో లారీ అసోసియేషన్ నాయకులు సమావేశం నిర్వహించారు. సింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డ్రైవర్ అంటూ హేళన చేసిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో డ్రైవర్లు తగిన బుద్ధి చెబుతారన్నారు. బాబు క్షమాపణ చెప్పాలన్నారు. చంద్రబాబుకు దళితులంటే ఎప్పటికీ చులకనే అన్నారు.

# అభివృద్ధికి టీడీపీనే అడ్డుగోడ

- ప్రజలకు సంక్షేమ ఫలాలు అందకుండా కేసులు
- 14 ఏళ్ల టీడీపీ పాలనలో చేయలేనివి ఐదేళ్లలో చేశాం
- ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి

**నంద్యాల టౌన్:** నంద్యాల అభివృద్ధికి అడుగడుగునా మోకాలడ్డుతూ పేదలకు ఇళ్ల పంపిణీ, ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం జరగకుండా కోర్టులకు వెళ్లి.. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందకుండా టీడీపీ నాయకులు అడ్డుపడుతున్నారని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని 17వ వార్డు విశ్వనగర్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు నంద్యాలకు ఎలాంటి మేలు చేయలేదని.. వారికి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. టీడీపీ నాయకులు స్వార్థ రాజకీయాలకు చిరునామా అని పేర్కొన్నారు. వారి హయాంలో నంద్యాల అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. ప్రజలకు జరుగుతున్న మంచిని చూడలేక కోర్టుకు వెళ్లిన ఘనత వారికే దక్కిందన్నారు. వార్డుల్లో ఎక్కడికక్కడ సీసీ రోడ్లు, డ్రైన్‌లు వేశామని, ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి పేదల సొంత ఇంటి కల నిజం చేశామని తెలిపారు. నంద్యాలను జిల్లా చేసి పట్టణ అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తున్నామని చెప్పారు. గత పాలకులు చేయలేని పనిని కేవలం ఐదేళ్లలో చేసి చూపించామన్నారు. తన తండ్రి శిల్పా మోహన్‌రెడ్డి పై నంద్యాల ప్రజలు ఎలాంటి ప్రేమ చూపారో తనపై కూడా అంతే ప్రేమ చూపిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం ఎలాంటి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడానికైనా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉంటారన్నారు. మంచి భవిష్యత్తు కోసం మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దృశ్యకళల అకాడమీ చైర్మన్ సునీత అమృతరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్ లక్ష్మీదేవి, నాయకులు సుబ్బరాయుడు, దేశం సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఎన్నికల సమయంలోనే గుర్తుకొస్తారా**

**గోస్పాడు:** టీడీపీ నాయకులకు ఎన్నికల సమయంలోనే ప్రజలు గుర్తుకు వస్తారని ఎమ్మెల్యే శిల్పా రవి ఎద్దేవా చేశారు. గోస్పాడు మండలంలోని దీబగుంట్ల, కానాలపల్లె గ్రామాల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ నాగిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు కష్టాల్లో ఉన్న సమయంలో మొకం చాటేసిన టీడీపీ నాయకులు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం పాకులాడుతున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చే పింఛన్ ఆలస్యం కావడానికి టీడీపీ కుట్రలే కారణమని ఆరోపించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని కోరారు. దీబగుంట్ల గ్రామంలో రూ.5కోట్లతో అండర్ టన్నల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏపీ ఎస్ఐడీసీ డైరెక్టర్ ప్రహ్లాదరెడ్డి, నాయకులు చిన్న నాగిరెడ్డి, ఉమామహేశ్వరరావు, రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శంకర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

**టీడీపీ మోసపూరిత మాటలు నమ్మకండి**


23వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

**నంద్యాల(న్యూటౌన్):** టీడీపీ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని 23వ వార్డులో కౌన్సిలర్ రాజ్యలక్ష్మి, పార్థసారథితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 40 ఏళ్ల అనుభవం ఉన్న ఫరూక్ నంద్యాలకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే నంద్యాలలో మెడికల్ కళాశాలతో పాటు నీటి కష్టాలను అమృత్ పథకం ద్వారా పూర్తి చేశామన్నారు. మోడల్ స్కూల్, ప్రభుత్వాస్పత్రి, అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించామని తెలిపారు. ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చేశామన్నారు. మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. చంద్రబాబునాయుడు నంద్యాల నియోజకవర్గానికి చేసింది శూన్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పాంషావలి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు జాకీర్‌హుసేన్, నాయకులు పున్నాశేషయ్య, అమీర్, సోమశేఖర్‌రెడ్డి, అనిల్‌అమృతరాజ్, శోభారాణి పాల్గొన్నారు.


మాజీ మంత్రి శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

## టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

**నంద్యాల:** పట్టణంలోని 1వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ నాయకుడు ఎంసీ మధుబాబు ఆధ్వర్యంలో పెద్ద మాతాంగి జంబులయ్య, అనిల్, సురేష్, ప్రసాద్, శీను, రవితో పాటు మరో 50 మందికి శిల్పామోహన్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో పెద్ద ఎత్తున చేరుతుండటం సంతోషకరమన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని, శిల్పా కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

### వడదెబ్బకు జాగ్రత్తలు తీసుకోండి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

**నంద్యాల:** నంద్యాల జిల్లాలో అత్యధికంగా 43.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కె.శ్రీనివాసులు జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. వడగాలులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కార్యాలయాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు బయట తిరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. వైద్య ఆరోగ్య, డీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, లేబర్, డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా, పశుసంవర్ధక, విద్యుత్‌శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలన్నారు. పీహెచ్‌సీల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పనులను ఉదయం 10:30 గంటల్లోపు ముగించాలని ఆదేశించారు. విద్యుత్ కోత లేకుండా చూడాలని.. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ అందించాలని తెలిపారు. తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు.

### కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా గోకుల్

**నంద్యాల(అర్బన్):** కాంగ్రెస్ పార్టీ నంద్యాల అసెంబ్లీ అభ్యర్థిగా భీమవరం గ్రామానికి చెందిన గోకుల్ కృష్ణారెడ్డిని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల మంగళవారం ప్రకటించారు. ఎమ్మెల్యే టికెట్ రావడంపై గోకుల్ కృష్ణారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.



## ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

**రుద్రవరం:** ఎన్నికల ప్రచారానికి అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని తహసీల్దార్ మురళీమోహన్, ఎంపీడీఓ రామచంద్ర అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఎన్నికల కోడ్ అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉంటే వెంటనే తొలగించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో ఎలాంటి సంఘటనలు జరిగినా సమాచారం అందించాలని ఆదేశించారు. ఒకేరోజు ఇరుపార్టీలకు చెందిన నాయకుల ప్రచారం లేకుండా చూసుకోవాలని సూచించారు. పింఛన్ల పంపిణీలో వలంటీర్లను దూరంగా ఉంచాలన్నారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ అందజేయాలని తెలిపారు.

## కోటా సుంకులా పరమేశ్వరికి అంబలి సమర్పణ


ప్రత్యేక అలంకారంలో సుంకులాపరమేశ్వరి


అంబలిని తీసుకెళుతున్న భక్తులు

**నంద్యాల(న్యూటౌన్):** పట్టణంలోని బాల్కొండ హాల్లో వెలసిన కోటా సుంకులాపరమేశ్వరికి మంగళవారం భక్తిశ్రద్ధలతో అంబలి సమర్పించారు. ఉదయాన్నే అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు పసుపులేటి నారాయణ, వెంకటేశ్వర్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## వివాహిత ఆత్మహత్య


సంతోషమ్మ మృతదేహం

**శిరివెళ్ల:** చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో కుంగిపోయింది. తెలిసీతెలియని వయసులో పెళ్లి చేశారు. అప్పుడప్పుడు కడుపు నొప్పి వస్తుండడంతో తాళలేకపోయింది. జీవితంపై విరక్తి చెందిన తనువు చాలించింది. ఈ ఘటన శిరివెళ్ల మండలం గోవిందపల్లెలో చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్ కథనం మేరకు.. ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లెకు చెందిన బద్రి సంతోషమ్మ (22) చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతిచెందారు. పినతండ్రి రవిచంద్ర సంరక్షణలో పెరిగింది. ఆరేళ్ల క్రితం గోవిందపల్లెకు చెందిన శ్రీనివాసులులో వివాహం చేశారు. వీరికి ఓ కుమార్తె (5), కుమారుడు(4) ఉన్నారు. తల్లిదండ్రులు దూరమయ్యారనే బాధ.. మరోవైపు కడుపు నొప్పి తీవ్రం కావడంతో తాళలేక ఈ నెల ఒకటో తేదీ అర్ధరాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు కొన ఊపిరితో ఉన్న ఆమెను నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందింది. పినతండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు. తాను అనుభవించిన బాధను తన పిల్లలు కూడా అనుభవించేలా చేసి వెళ్లిపోయిందని స్థానికులు బోరున విలపించారు.

## ఇఫ్తార్ విందులో ప్రజా ప్రతినిధులు


ఇఫ్తార్ విందులో ఎంపీ పోచా, గంగుల ప్రభాకర్‌రెడ్డి

**ఉయ్యాలవాడ:** రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ముస్లింల మధ్య సోదర భావాన్ని పెంపొందిస్తాయని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జలవనరులశాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, భూమా కిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక బస్టాండ్ ఆవరణలోని నూరాని మజీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, అమీర్ అహమ్మద్ పాల్గొన్నారు.